# గడియ

రాజారావు ఆఫీసు మెట్లు ఎక్కుతున్నాడు. నీటుగా, రీవిగా, ఆకర్షణీయంగా వున్న అతను ఆఫీసరు హెూదాలో ఆఫీసు మెట్లు ఎక్కుతుంటే ఎంతోమంది అతన్ని పలకరించకుండానే వినయవిధేయతలు ప్రదర్శిస్తున్నారు. రాజారావు మాత్రం చూసీ చూడనట్లు ముందుకు కదులుతున్నాడు. అతను అప్పుడే విడుదలయిన కొత్త రూపాయి నోటులా పెళపెళ లాడుతూ వున్నాడు. నిజానికి అతను రోజూ అలాగే ఉంటాడు. ఏకాయెకి ఆఫీసరుగా ఉద్యోగంలోకి వచ్చిన రాజారావు, చాలా రిజర్వుడుగా, తనక్రింద పనిచేసే వారందరికీ దూరంగా అనుక్షణం తన హెూదాని నిలబెట్టుకుంటూనే వుంటాడు.

రాజారావు తనకోసం ప్రత్యేకించిన అందమైన ఆఫీసు గదిలో అడుగుపెట్టి స్ప్రింగ్‌డోర్ వేగంగా మూశాడు. అది మూలుగుతూ వెళ్ళి క్లిక్‌మని మూసుకు పోయింది.

రాజారావు పదిగంటలకే ఆఫీసుకు వచ్చినా అతన్ని పదకొండు దాటేవరకు ఎవ్వరూ పలకరించడానికి వీల్లేదు. అతనంతట అతను పిలిస్తేనే గాని, ఏ ఒక్కరూ అతని తలుపు తోసుకొచ్చే అవకాశం లేదు. అలా చెయ్యరాదని అతను మొదట్లోనే ఆర్డర్సు యిచ్చాడు. ఎంత కొంపమునిగే పనివున్నా-పదకొండు గంటలు దాటాకే అతని గదిలో ఎవరైనా అడుగు పెట్టగలరు.

రాజారావు రివాల్వింగ్ ఛైర్‌లో విశ్రాంతిగా కూర్చున్నాడు. అది మెత్తగా విలాసంగా కదులుతోంది. పైన ఫ్యాన్ సుతిమెత్తగా తిరుగుతోంది. డెకలామ్ టేబుల్లోంచి ఫేనురెక్కలు నీటిలో అటూ ఇటూ గెంతుతున్న చేపల్లా కనిపిస్తున్నాయి.

నలుగురన్నదమ్ములు కలిసివున్న ఉమ్మడి కుటుంబంలో రెండోవాడి ఏకైక కుమారుడుగా రాజారావు పుట్టాడు. మొత్తం అంతా కలిసి పిల్లలు పన్నెండుమంది వరకు వుండేవారు. కాని రాజారావు తల్లి కామాక్షి నలుగురిలో కలిసి గలగల్లాడుతూ వుండడం యిష్టంలేక ఆమె ఎప్పుడూ ఒక్కతే ప్రత్యేకంగా, గర్వంగా మసిలేది. కొడుక్కి కాస్త ఊహ తెలిసినప్పటి నుంచి "ఆ అల్లరి వెధవల్తో తిరక్కు. అడ్డమైన వాళ్ళ జట్టుకడితే మనకున్న విలువ కూడా పోతుంది" – అనీ.

"మీ తాతగారు హైకోర్టు జడ్జీ తెలుసా, ఆయన హెూదాకు తగి వుండాలి గాని, అందరితో కలిసి తిరిగి ఆయనకి అపకీర్తి తేబోకు."

అని సమయానుకూలంగా హితబోధ చేస్తుండేది. స్వతహాగా తల్లి పోలిక పుణికి పుచ్చుకున్న రాజారావు ఆమె హితువు నరనరాల్లోనూ జీర్ణించుకున్నాడు.

అతనికి ఏడాదినుంచీ కారు తోలుతున్న డ్రైవరు యింతవరకు తను అడిగిన దానికి ఒక్క ముక్కలో సమాధానం తప్ప ఏమాటా మాట్లాడి ఎరగడు.

ఆఫీసులో హెడ్‌గుమాస్తా గడగడ వణుకుతాడేగాని, చనువుగా ఒక్కమాటా మాట్లడడు. అసలు అతను చేతులు కట్టుకోకుండా నిలబడలేడు.

టైపిస్టు కనకవల్లి అందంగా ట్రిమ్‌గా వుంటుంది. తనకి కావలసిన దానికంటె ఒక్కమాట మాట్లాడదు. ఆమెను చూస్తూ మాత్రం రాజారావు చిత్రంగా ఫీలవుతాడు. అందరూ తనకింద సబార్డినేట్స్‌గా ప్రవర్తిస్తారు. కాని ఆమె మాత్రం అలా ఉండదు. అందుకే ఆమె అంటే చిరాకు – కించిత్ భయం కూడాను.

రాజారావు వాచీ చూసుకున్నాడు. పదిన్నర అయింది.

అకస్మాత్తుగా కరెంటు పోయింది. ఫ్యాన్ ఆగిపోయింది. పదినిముషాలు చూసినా అది తిరిగి రాలేదు. ఉక్కపోతగా వుంది. బజర్ నొక్కాడు. అది మోగలేదు. నాలిక్కరుచుకున్నాడు, తనే లేచి వెళ్ళి కిటికీ తెరలు తొలగించి తలుపులు తీసాడు. దూరంగా కాలువ ప్రవహిస్తోంది. ఒకదాన్ని ఆనుకొని మరొకటి చిన్న చిన్న గుడిసెలు కుక్కగొడుగుల్లా వున్నాయి. ఆ పాకల్లోంచి జనం అటూ ఇటూ తిరుగుతూ ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. కొందరు కొట్లాడు కుంటున్నారు. కొందదు పరాచికా లాడుకుంటున్నారు. కొందరు ఎండకి తట్టుకోలేక దుప్పటి పూర్తిగా కప్పేసుకుని నిద్రపోతున్నారు –

రాజారావు విసుగ్గా వెనక్కి తిరిగాడు.

ఇంకా ఫ్యాను తిరగడం లేదు. బజర్ మోగదు. తనే వెళ్ళి తలుపు తోసి ప్యూన్ని పిలుద్దామని చూసాడు. తలుపు బిగుసుకుపోయి వుంది. అతను అయిదు నిమిషాలు ప్రయత్నం చేసినా అది రాలేదు. చెమటలు పోశాయి. దాహం వేసింది. లోపల నీళ్ళు లేవు. ప్యూన్ని పిలిచే మార్గం లేదు. తలుపు దబదబ బాదుదా మనిపించింది. వెంటనే తన హెూదా, తన వ్యక్తిత్వం గుర్తొచ్చి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు. తను విసురుగా తోసేయడంతో బోల్టు తాళం పడిపోయింది. ఇప్పుడేం చేయ్యాలి? బయట నుంచి ఎవరైనా తీస్తేనే గతి? క్షణాలు గడుస్తున్న కొద్దీ తనందరి నుంచి యింతగా వేరుపడిపోవడం ఆ క్షణంలో దుర్భరంగా అనిపించింది.

ప్రపంచం నుంచి తనకి అనుబంధం కట్ అయిపోయినట్లు భయం వేసింది. రాజారావు అశాంతిగా మళ్ళీ లేచి కిటికీ దగ్గరికి వెళ్ళాడు. దూరంగా మనుషులు తిరుగుతున్నారు. వాళ్ళంతా తనకి దూరంగా ఉన్నట్లు అనిపిస్తోంది. దాహంతో గొంత ఆర్చుకుపోతోంది. దూరంగా కాలువలో నీళ్ళు గలగలా పరుగెడుతున్నాయి. అందులో కేరింతలు కొట్టే పిల్లలని చూస్తే ఈర్ష్య కలుగుతోంది.

రాజారావు అశాంతిగా గదిలో పచార్లు చేస్తున్నాడు. మరొక్కసారి తలుపు తీయటానికి ప్రయత్నించాడు. కాని అది విడలేదు - అతనికా వంటరితనంలో తన ప్రత్యేకత, హెూదా, భస్మమైపోయాయి. హెడ్ గుమాస్తా వచ్చి, ఆ బోల్టు తీస్తే బాగుండును అనిపిస్తోంది. అతను చాదస్తుడే కాని మంచివాడు, అనిపించిందా క్షణంలో. మనిషి కోసం, మనసు కోసం ఎదుటి మనిషి పాకులాడతాడు. అది సహజం - కాని హెడ్ గుమస్తాకి తను కోపంతో ఎగురుతాడని భయం. అందుకే రాదు - దాహంతో నోరెండిపోతోంది. ఎండ చుర్రున కాస్తోంది. గాలి రావడం లేదు. ఊపిరి సలపనట్లుగా వుంది. కాలం మందంగా నడుస్తుంది. పదకొండు ఎప్పుడో దాటిపోయింది. తనకోసం ఎవ్వరూ రాలేదు. అంటేతనెవ్వరికీ అక్కర్లేదా? ఏమో -

అతను మళ్ళీ బజర్ నొక్కి చూసాడు. స్వరపేటిక తీసేసిన మనిషిలా అది మౌనంగా వూరుకుంది.

అతను కుర్చీలో జారగిలబడి తిరగని ఫ్యాన్‌కేసి చూస్తున్నాడు. దాని రెక్కలకి నల్లగా పట్టిన బూజు నిశ్చలంగా వుంది. అది ఫ్యాన్ తిరుగుతున్నంత వరకు తెలీదు. ఆగిపోతే అంతా మట్టిగా వుంది.

పన్నెండు కావస్తుండగా తలుపు క్లిక్ క్లిక్ మంది - రాజారావు నీరసించిన కళ్ళతో, తడారిపోయిన పెదాలతో ఆశగా చూసాడు. మరోసారి క్లిక్ మని డోర్ తెరుచుకుంది.

కనకవల్లి లోపలికి అడుగుపెట్టింది - ఒక్కసారి కరెంట్ వచ్చింది. ఫ్యాన్ నెమ్మదిగా తిరగడం మొదలుపెట్టింది.

"గుడ్‌మార్నింగ్ సార్, ఒక అర్జంట్ లెటర్ - నిన్న మీరు చెప్పమన్నారు - అందుకని - చెప్దామని - మిమ్మల్ని డిస్టర్బు చేసాను" అంది వినయంగా.

"నెవర్ మైండ్ ప్లీజ్ బి సీటెడ్" అని ఆమెకి కుర్చీ చూపించి - బజర్ నొక్కాడు. ప్యూను అందించిన గ్లాసు నీళ్ళు గటగటా తాగేసి ఆమెకేసి చూసి నవ్వాడు -

ఆశ్చర్యంలోంచి తేరుకోలేని కనకవల్లి అలాగే శిలా ప్రతిమలా నిలబడింది.

"ఏది పేపర్, కూర్చోండి" అని ప్యూనుతో రెండు కాఫీలు తెమ్మని చెప్తూంటే తనకీ, తన చుట్టూ వున్న మనుషులకీ మధ్య గడియ విడినట్లు అనుభూతి పొందాదు రాజారావు.